అంతర్యుద్ధం

నీలా

ఆఫీస్ ఒక్కసారిగా స్తంభించిపోయినట్లయింది.

స్కూటర్ వచ్చి ఆగింది. మేనేజర్ తన గదిలోకి వెళ్ళాడు. అందరి కళ్ళలోనూ ఉత్కంఠ!

ఎవరూ మాట్లాడటం లేదు. అయినా వారందరికీ తమ తమ అభిప్రాయాలు చెప్పాలనుంది. అటెండర్ రాజు ఆ రోజు వచ్చిన "పోస్టు" మేనేజర్ గదిలోకి తీసుకెళ్ళాడు. ఊపిరి బిగబట్టి చూస్తున్నారంతా.

రాజు చిద్విలాసంగా బయటకువచ్చి కర్టెన్ సర్దాడు. తిరిగి అందరి కళ్ళలోనూ ఏం జరిగిందనే ప్రశ్నలు. ఆ రోజు వచ్చిన లెటర్స్‌లో ఓ మందపాటి కవర్ మీద "కాన్ఫిడెన్షియల్" అని రాసుంది.

అందరి ఉత్కంఠకూ కారణం అదే!

సాధారణంగా సంవత్సరానికోసారి మాత్రమే ఇలాంటి లేఖలు వస్తుంటాయి. అవి ఉద్యోగస్థులమీద సంవత్సరానికోసారి కాన్ఫిడెన్షియల్ రిపోర్టులు పంపిచ

మంటూ రాసే లేఖలు. తిరిగి ఆ రిపోర్టులుకూడా రహ స్యంగానే పంపిస్తారు విడి సందర్భాలలో యేమైనా ప్రత్యేక సందర్భాలు మినహాయిస్తే ఇలాంటివి రావు. రోజువారీ వచ్చే లేఖలు పల్చటి కవర్లలో వస్తుంటాయి.

లెటర్స్ ఒక్క మేనేజర్ మాత్రమే చింపుతాడు. ఆ లెటర్లు చింపి అందులో విషయం తెలిసేదాకా అంద రికీ ఆరాటంగా వుంటుంది. పల్చటి కవర్ చింపక పోయినా అందులోని విషయాన్ని కొంతవరకు గ్రహించ గలుగుతారు. మందపాటి కవర్లో ఆ అవకాశం యే మాత్రం లేదు.

ప్రస్తుతం కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్స్ పంపించే సమయంకాదు. అవి పంపించి కొంతకాలమయింది. అదే విధంగా ఆఫీసుకు చెంది ఈ నడుమ ఎలాంటి గొడవలు లేవు. అవినీతి ఆరోపణలు గాని, నెగ్లిజన్స్ అఫ్ డ్యూటీ అనే అంశంమీద యెవరిమీదనైనా మెమో సర్వ్ చేయటం లాంటిది కూడా లేదు. మరా లెటర్ యేమై వుంటుంది?

రాజు వెనక్కి వెళ్ళాడు. ఒక్కొక్కరూ తమ సీటు నుంచి లేచి అతని వెనగ్గా వెళ్ళారు.

"రాజా ఆ లెటర్ చూశారా?"

"లేదండి. ఆయింకా చింపలేదు."

"ఎందుకని."

"ఏమో. ఆ లెటర్ మాత్రం ప్రక్కన పెట్టాడు."

"గురుడు సస్పెన్స్ మైంటన్ చేయటంలో నిపు ణుడు."

"ఎవరూ ఏం కంగారు పడాల్సిన అవసరంలేదయ్యా. ఆయనగారికే యేమన్నా వచ్చివుంటుంది" అన్నాడు

శివం. శివం తమిళుడు కాదు. తెలుగువాడే.

"అంతేనంటావా" అన్నాడు. వెంకటేశ్వర్లు.

అప్పుడు బజర్ మ్రోగింది.

రాజు పరిగెత్తుకుంటూ వెళ్ళాడు.

"శివాన్ని పిలువ్."

ఆ మాట అందరికీ వినిపించింది.

శివం గంభీరంగా మారిపోయాడు. తన మాటలు ఆయన విని వుంటాడనిపించింది. ముఖంలో ఏమాత్రం భయాన్ని కన్పించకుండా లోనికి నడిచాడు.

"నమస్తే సార్" విష్ చేశాడు.

"నమస్తే. టేక్ యువర్ సీట్."

శివం కూర్చున్నాడు.

మేనేజర్ ఒక్కసారి శివంకేసి పరిశీలించాడు.

శివం అయిదడుగుల ఎనిమిది అంగుళాల ఎత్తుంటాడు. ఆ ముఖంలో పెద్ద మీసాలూ.... చురుకయిన కళ్ళు ఆకర్షిస్తుంటాయి. అతనెంతగా ప్రయత్నించి యేమేం పౌడర్లూ, క్రీమ్స్ వాడినా తన వదనంలోని క్రూరత్వాన్ని కొద్ది భాగం మాత్రమే కప్పిపుచ్చగలడు.

అతన్ని చూడగానే ఎవరికీ సదభిప్రాయం కలగదు. అతను ఓ ఆఫీస్‌లో లోయర్ గ్రేడ్ క్లర్క్‌గా పని చేస్తున్నాడనే విషయాన్ని ఎవరూ విశ్వసించరు. ఇంటి దగ్గర తిని దేశంమీద పడి తిరిగే రౌడీగా భావిస్తారు.

శివం తన దేహాన్ని తెలివితేటల్ని తలుచుకొని మురిసిపోతుంటాడు. ఎలాంటి చిన్న విషయాలోనయినా వెంటనే రియాక్ట్ అవుతాడు. ఆఫీస్‌లో ధైర్యంగా మాట్లాడే ధైర్యం తన కొక్కడికే వుందని అతని నమ్మకం. ఏ ఆఫీసర్లూ అతన్ని తమ దగ్గర వుంచుకోవటానికి అంగీక

రించరు. ఎవరికయినా తప్పకపోతే అతన్ని చూసీ చూడ నట్లు వదిలేసారు.

"హెడ్ ఆఫీస్ నుండి మీకో మెమో వచ్చింది."

"నాకా?" ఆశ్చర్యంగా అన్నాడు.

"అవును."

"ఎందుకు సార్?"

"మీ సి. ఆర్స్ మీద వారేదో వివరణ అడుగుతున్నారు. విత్ ఇన్ త్రీ డేస్ లోపు మీరు సబ్‌మిట్ చేయాల్సి వుంటుంది."

శివం మాట్లాడలేదు..

మేనేజరు శివానికి మార్కు చేసిన కాపీ అందించాడు.

శివం మౌనంగా అందుకొన్నాడు.

"వస్తా సార్!"

మేనేజరు తలూపాడు. కాయితం అందుకొని బయట కొచ్చిన శివం కేసి అందరూ ఆశ్చర్యంగా చూశారు.

"ఏమిటి గురూ!"

"మెమో యిచ్చారయా" శివం కంఠం కంగున మ్రోగింది.

"దేనికి?"

"మాడాలి" అంటూ వెళ్ళి కూర్చుని ఆ లెటరు పరిశీలించాడు.

అది గతసంవత్సరానికి చెందిన సి. ఆర్స్ మీద ఆఫీసర్ రాసిన కామెంట్. "హిజ్ ఇంటెగ్రిటీ ఈజ్ నాట్ టోటల్లీ రిలయబుల్. హి హేజ్ ఎ టెండన్సీ నాట్ టు రెస్పెక్ట్ హిజ్ సుపీరియర్స్" ఈ రెండు అంశాలమీద శివం వివరణ కోరారు. అది మూడురోజుల లోపు ఇవ్వాల్సి వుంటుంది.

శివం అది చదివాక క్షణకాలం కంగారుపడ్డాడు. అతని ముఖంలో కోపం స్థానంలో భయం చోటు చేసుకొంది. అతను ఈ ఉద్యోగంలో చేరి ఆరు సంవత్సరాలు దాటుతుంది. ఇలా జరగటం ఇదే మొదటిసారి. అందుకే అతనికి తెలియకుండానే చేతులు వణకటం మొదలు పెట్టాయి.

"ఇటివ్వు" అని ఆ లెటరు అందుకొని చదివాడు వెంకటేశ్వర్లు.

"ఎవరు రాశారంటావ్?" అన్నాడు.

నిజానికి అతనికి మహదానందంగా వుంది. అప్పు అడిగితే యివ్వలేదని శివం అతన్ని భయంకరంగా తిట్టివున్నాడు. అందుకే శివం అంటే గొంతుదాకా కోపం. అయినా అతన్ని యేమీ చేయలేక ఆ కోపాన్ని తనలోనే దాచుకున్నాడు. శివాన్ని అడగటంలో తన సంతోషాన్ని కప్పిపుచ్చుకొని, సానుభూతి పులుముకొని మరీ అడిగాడు. ఇవేవీ గమనించే స్థితిలో శివం లేడు.

"ఇంకెవడు రాస్తాడు, ఆ భోషడీగాడే" అన్నాడు.

ఆ భోషడీగాడు "రామారావ్".

"వాడేనంటావా?"

"వాడే. ఈ రిపోర్ట్ ఈ సంవత్సరానిది కాదు. పోయిన సంవత్సరానిది."

తిరిగి బజర్ మ్రోగింది. ఎవరి సీట్లలోకి వారు చేరిపోయారు. రాజా లోపలకు వెళ్ళాడు.

"మంచినీళ్ళు పట్రా" మేనేజరు కంఠం మ్రోగింది.

అందరూ ఊపిరి పీల్చుకొన్నారు.

ఆ లెటరు ఒక్కొక్కరే అందుకొని చదవటం మొదలు పెట్టారు.

శివం కర్నూలు నుండి ఈ నడుమే ట్రాన్స్ఫరు

కా డాడు. విజయనగరం వస్తున్నందుకు అతనెంతో సంతోషించాడు. అక్కడ డిపో మేనేజరుతో కోలా తగాదా కి ప్రతి చిన్న విషయంలోనూ వారికి అభిప్రాయ బేధా లొచ్చేవి. అక్కడున్నంతకాలం ఒకరొ్నకరు యేదేదో చేయాలని ప్రయత్నం చేశారు. ఆ యుద్ధం ఆగేదికాదు.

శివం ఈ లోపు మరో సమస్య ఎదుర్కొన్నాడు. అది కుటుంబ సమస్య. సరిగ్గా అప్పుడే ట్రాన్స్‌ఫర్ కావటం జరిగింది. విజయనగరంలో నూతనంగా ఓ. బ్రాంచి యేర్పాటు చేస్తూ శివాన్ని అక్కడ పోస్టు చేశారు. ఆ రోజు కూడా చివరిసారిగా డిపో మేనేజరుతో పోట్లాట జరిగింది. తనకు అడ్వాన్సుగా ఆరు వందలు కావాలంటూ అడిగాడు శివం. అందుకు తిరస్కరించాడతను. దాంతో గొడవ మొదలయింది. ఇద్దరూ అరుచుకున్నారు.

"ఆరువంద లివ్వడానికి రూల్ లేదు" అంటాడాయన.

"ఆ రూల్ నువ్వు చూపించు" అంటాడు శివం.

చూపించటానికి యేం లేవు. ఆఖరుకు అకౌంటెంట్ యిద్దరికీ నచ్చచెప్పి అయిదువందలకు అంగీకరింపజేశాడు. శివం డబ్బుందుకొని అలానే వచ్చేశాడు.

శివానికి ఫేర్‌వెల్ ఇవ్వటం లాంటి కనీస సంప్రదాయాల్ని కూడా యెవరూ పాటించలేదు. డిపో మేనేజరు నిరంకుశుడు. నిజంగానే శివం తప్పించి ఆ ఆఫీస్‌లో మాట్లాడే ధైర్యం యెవరికీ లేదు. ఇప్పుడు అతనికి యిష్టంలేని వ్యక్తికి ఫేర్‌వెల్ యిస్తే ఆ కక్ష మనసులో పెట్టుకోవచ్చు. అందుకే యెవరికివారు మౌనం వహించారు.

కథ అంతటితో ముగియలేదు.

శివం వచ్చిన నెల రోజుల్లోపు ఆ డిపో మేనేజరు అసిస్టెంటు మేనేజరుగా విజయనగరంలో పోస్టు చేయబడ్డాడు. ఇద్దరూ ఎక్కడ ఒకేచోట ఫీల్డులో పని చేయాల్సి వచ్చింది. శివం ప్రత్యర్థి, అసిస్టెంట్ మేనేజరు రామారావ్!

వారిద్దరి నడుమ అనేక తగాదాలు జరిగాయి. ఇలా జరగటం ఇదే మొదటిసారి.

శివం లేచి మేనేజరు గదిలోకి వెళ్ళాడు.

"నేను ఫీల్డుకు వెళ్తున్నా సార్!" అని చెప్పి వచ్చేశాడు.

ఫీల్డులో అయిదుగురు పని చేస్తుంటారు. ఆఫీస్‌లో మరో అరుగురుంటారు. క్షణాల్లో ఈ వార్త అందరికీ తెలిసిపోయింది.

కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్స్‌కు చెంది కొన్ని నైతిక నియమాలున్నాయి. ఓ వ్యక్తి ప్రవర్తనకు చెందిన ఈ రిపోర్టుల ఆధారంగా ప్రమోషన్లు ఆపి వేయవచ్చు. ఇంక్రిమెంట్లు కట్ చెయొచ్చు. ప్రొబేషన్ పీరియడ్ ఎక్స్టెండ్ చేయొచ్చు.

మామూలుగా అతడెంత దుర్మార్గుడైనా కానీ సి. ఆర్స్ చెడగొట్టడానికి పూనుకోరు. అలా రాయబోయే ముందు తనో వ్యక్తి జీవితంమీద దెబ్బకొట్టబోతున్నాననే విషయం గుర్తుకొస్తుంది. ఆ సమయంలో తప్పకుండా తమ మానసిక వత్తిడుల్ని అదుపులో పెట్టుకుంటారు. అందుకు ప్రయత్నిస్తారు.

అలా కాకుండా సి.ఆర్స్ చెడగొట్టేవారు రెండు రకాలుగా ఉంటారు. మొదటి రకంవారు యువకులు. వారికి జీవితానుభవం తక్కువ. ఉద్రేకం ఎక్కువ తమ ఉద్యోగ జీవితం వ్యక్తిగత జీవితం భిన్నమైనవనే విష

యాన్ని వారు అర్థం చేసుకోలేరు. వారిలో ఉద్రేకమే ప్రధానమయినప్పుడు విచక్షణారహితంగా రాస్తారు.

మరోరకం నిజంగా ఆ వ్యక్తివల్ల గాయపడ్డవారు. అతని అవినీతిని, క్రమశిక్షణా రాహిత్యాన్ని ఏమాత్రం సహించే దశ దాటిపోయాక మాత్రమే అందుకు పూనుకుంటారు.

రామారావుకు షార్ట్ టెంపర్ ఉంది. అతను యువకుడు. శివ వల్ల ప్రతిక్షణం టెంక్షన్ అనుభవించేవాడు.

“రామారావ్ ఇంత పని చేస్తాడనుకోలేదు” అన్నారెవరో.

“రామారావే కాదు. హృదయమున్న వాడెవడూ ఈ పని చేయడు ఏమైనా ఉంటే బయట చూసుకోవాలి. అంతే కాని చేతిలో అధికారం ఉందికదాని”

“ఇవాళ శివానికి రాసాడు, రేపు మరొకరికి.”

“అరే రేపో మాపో ప్రమోషన్ రావాలి. ఇప్పుడెంత డ్రాబాక్.”

“అవును. భవిష్యత్ మీద కొట్టాడు.”

“హాంగ్ వెధవ” ఎవరో తిట్టారు.

శివం కళ్ళు ఆగ్రహంతో మండిపోతున్నాయి. ఈ క్షణంలో రామారావెదురుపడితే మీదపడి కొట్టేస్తాను. బలంగా కొడితే రామారావు చచ్చిపోతాడు కూడా!

రామారావు సన్నగా ఉంటాడు. అతని బుగ్గలూ, కళ్ళూ లోతుకుపోయుంటాయి. అస్థిపంజరానికి తోలూ, ఆ తోలుకు బట్టలు తొడిగినట్లుంటాడు.

అతనికి తరచుగా కోపం వస్తుంటుంది. అలా వచ్చినప్పుడు “నాకు పర్సనాలిటీ లేకపోబట్టి సరిపోయింది, నేనూ నీ అంత ఉంటేనా” అంటుంటాడు.

రామారావు సాంఘికంగా, ఆర్థికంగా వెనకబడ్డ కులంలోనుండి వచ్చాడు. తన చదువు పూర్తి కావటంతోనే ఉద్యోగం వచ్చింది. శివానికి అతనంటే లెక్కలేకపోవటానికి అతని కులం కూడా ఓ కారణం!

"చూడు శివం. ఈ విషయంలో నువ్వు మరీ ఉద్రేక పడ్డావనుకో. అది నీకే నష్టం. ఇలాంటి వాటికి కంగారు పడాల్సిన అవసరం లేదు. రెవిన్యూ డిపార్టుమెంట్‌లో అయితే మెమోల్లో కొట్టుకుంటారు. నాకు తెలిసినాయన ఉన్నాడు. బ్రహ్మాండంగా డ్రాఫ్ట్ రాస్తాడు. ఆయన చేత రిప్లై ఇప్పించామంటే ఇంక తిరుగుండదు. లాయర్లెందుకు పనికొస్తారు. రామారావ్‌తో తగాదా పెట్టుకుంటే అతని ఎలిగేషన్స్‌కు ఇంకా బలం వస్తుంది. నువ్వు సస్పెండ్ అయినా ఆశ్చర్యంలేదు. కాబట్టి నువ్వు కంట్రోల్ కావాలి" అన్నాడు రాఘవ.

"ఆ నా కొడుకుని వదిలిపెట్టను గురూ" అన్నాడు శివం.

"వదిలిపెట్టొద్దు. కానీ యిప్పుడు మార్గం కాదు. పైగా ఎవరిముందూ ఏం కామెంట్ చేయొద్దు. వాళ్ళు ఏదో సానుభూతిగా అంటారు. అందుకు నువ్వు రెచ్చిపోయి ఏమన్నా అంటే తీసుకెళ్ళి మోస్తారు."

"వాడిలా చెయ్యటం బాగుందా?"

"బాగుందని ఎవరంటారు. కక్షతోనే చేశాడని అర్థమయింది కదా. అయినా ఈ ఆరు సంవత్సరాలలో నీకు కనీసం మెమో అయినా ఇవ్వలేదంటున్నావు. ఆయన ఆరోపణలకు బేస్ లేదు. ఈ మెమోవల్ల నీకేం జరగదు గాని.... నువ్వు ఆవేశపడితే వాడి వలలో ఇరుక్కున్నట్లే" వివరించాడు రాఘవ.

శరీరంలో ఎంత తెగింపు వుందో అంతే పిరికితనం కూడా ఉంది. ఎంత గంభీరంగా మాట్లాడగలడో అంత త్వరగానూ లొంగిపోగలడు.

"సరే నేనేం మాట్లాడను. మనం దీనికి రిప్లై ఎప్పుడు ఇద్దాం?"

"ఈ రోజు సాయంకాలం ఆయన్ని కలుసుకొని మాట్లాడతాను. రేపు రాయొచ్చులే. మూడు రోజులు టైముంది కదా" అన్నాడు రాఘవ.

2

రామారావు ముఖంలో కళ లేదు. గిల్టీగా ఫీలవుతున్నట్లుగా కనిపిస్తున్నాడు. ఆయన ముందు రాఘవ కూర్చుని వున్నాడు.

"మీరిలా రాయటం ఏం బాగుండలేదు సార్. మీకెంత ద్వేషమైనా ఉండొచ్చు. కానీ అతనిమీద ఆధారపడిన వారు దెబ్బతింటారనేది మీరు ఆలోచించాలి" అన్నాడు రాఘవ.

"లేదయ్యా. అతని సంగతి మీకు తెలవదు. కర్నూలులో ఉన్నప్పుడు నన్నెంత బాధలు పెట్టాడో మీకు తెలియదు. అక్కడ పార్టీలనందరినీ నా మీదకు పంపించేవాడు. హెడ్ ఆఫీస్ ముందు ఆయన మూలంగా ఎన్నిసార్లు తలవంచుకోవలసి వచ్చిందో నీకు తెలుసా? నామీద ఒకాయన కోర్టులో దావా నడుస్తుందయ్యా. నేను మాత్రం మనిషిని కదా?" అన్నాడతను.

రాఘవకు ఏం జవాబు చెప్పాలో అర్థం కాలేదు.

"ఈ రోజు నీకు చెబుతున్నానయ్యా. నన్ను అమ్మ అక్క అంటూ తిట్టాడు. నేను సన్నగా ఉండబట్టి సరిపోయింది. లేకుంటే ఆ హాలో విరిచేసేవాడ్ని. ఇంటి

దగ్గర వాళ్ళేం చేశారయ్యా. యెంతకాలం సహించ మంటావో చెప్పు అతడికి నేనంటే ఏమన్నా లెక్కుందా? అందుకు కదా నేను రాసింది."

"ఏది యేమైనా మీరు కూడా తొందరపడ్డారు. మీ గో విషయం ఆలోచించటంలేదు. మొత్తం ఎంప్లాయీస్ దృష్టిలో మీ గురించి చర్చ జరుగుతుంది. దీన్ని యెవరూ ఆమోదించరు."

"దేన్ని ఆమోదిస్తారయ్యా. ఆయన బూతులు తిట్టినా, యేం చేసినా ఊరుకుంటే ఆమోదిస్తారా? మీరందరు కూడా ఆయనకు మల్లే నే వుండొచ్చు కదా. ఏందయ్యా ఆయన గొప్ప. ఆయన్ది గొప్ప కులం అయితే ఏంటయ్యా నా కింద పని జేస్తున్నప్పుడు నా మాట వినాలా వద్దా" అన్నాడు రామారావు కోపంగా.

"అది నిజమే అనుకోండి. ఆఫీస్ వ్యవహారాల్లో యేవేవో వస్తుంటాయి. అవన్నీ పర్సనల్ గా తీసుకో కూడదు."

"ఎన్నిసార్లయ్యా చూసేది. అతను ఆఫీస్ గదుల్లో వ్యభిచారం చేస్తాడయ్యా. ఎవడన్నా చూస్తే నా పరువేం కావాలి?" అన్నాడు.

"మీ కంత ఖచ్చితంగా తెలిసినప్పుడు అప్పుడే చర్య తీసుకోవాల్సింది. నేను చెప్పే పాయింట్ మీకు అర్థం కావటంలేదు. అతను అభ్యంతరకర పనులు చేసినప్పుడు మాత్రం యేం చేయకుండా ఇప్పుడిలా చేయటం యేం బాగుందంటారు?" అన్నాడు రాఘవ.

అప్పటికి రామారావు కర్థమయింది. "అయినా నే నంత స్ట్రాంగ్ గా రాయలేదు కదా. ఊరికే వార్నింగ్ కి రాశా. ఇప్పటికయినా మారతాడా అని...."

"మారతాడు లెండి."

"మారతాడా! వాడి నమ్మకం లేదు. అతని సంగతి మీకు తెలియదు" అన్నాడు రామారావు.

రాఘవ నవ్వి "మీరు ఆ మెమోమీద పట్టుబట్టి కూర్చోకండి" అన్నాడు లేస్తూ.

"అబ్బే ఆదేం లేదయ్యా. ఆ రోజు ఆఫీసులో యెవరి మీదో పెట్టి చెండాలంగా తిట్టాడు. ఆ కోపంతో రాశాను."

రాత్రికి బార్‌లో శివం, రాఘవ కలిశారు.

"ఏం గురూ! మాట్లాడావా?" అన్నాడు శివం.

"మాట్లాడాను. దాదాపు యేడ్చినంత పని చేశాడు" అన్నాడు రాఘవ.

"ఏమిటంటు?"

"ఏమిటేమిటి? నీ భాగోతం అంతా చెప్పుకొచ్చాడు. ఆయన్ని నానా చెండాలంగా తిట్టావంట, ఆఫీసుగదుల్లో వ్యభిచారం చేశావుట. పార్టీల్ని ఎగదోశావుట. ఆయన మీద కోర్టులో కేసు కూడా ఉందట గదా" అన్నాడు రాఘవ.

"అదా!" అంటూ నవ్వాడు. శివం.

"అంటే నిజమేనా?"

"నిజమే గురూ! వాడు నన్ను సతాయించాలని చూశాడు. నేను వాణ్ణి సతాయించాను"

"అందుకే అతనలా రాశాడు."

"వాణ్ణి వదిలిపెడతా ననుకొంటున్నావా? ఆ మొఖంమీద ఏసిడ్ పొయ్యాలా కొడుక్కి."

"పోశావు లే. అదేమంత గొప్ప విషయం కాదు. ఆ తర్వాత నిన్ను జైల్లో వేస్తారు."

"వేస్తే యేమౌతుంది? ఈ రోజు నడిరోడ్డుమీద చంపితేనే దిక్కులేదు" అన్నాడు గ్లాసు అందుకుంటూ.

"కథలు చెప్పకు. ముందు నీ ఉద్యోగం పోతుంది. ఆ తర్వాత గొడవలు. ఈ హెడేక్ అంతా యెందుకు? నువ్వు కూడా నీ పద్ధతులు మార్చుకోవాలి. ఆయన్ని అమ్మ బూతులు తిట్టావట. ఎందుకలా?"

"ఆ రోజు యేదో అన్నాడు గురూ, అందుకు."

"ఆ రోజు రాశాడంట."

"అలాగ" అన్నాడు ఆలోచిస్తూ.

"అవును. సరి యేం చేస్తాను? నువ్వు ఆయన్ని పేరు పెట్టి తిడితే యేమన్నా చర్య తీసుకోగలడు. అసలు మీ యిద్దరికీ యే విషయంలో తేడా లొస్తున్నాయి?"

"నా పర్సనాలిటి చూసి ఏడుపు బాస్! రోజూ ఆఫీస్‌కి టక్ చేసుకొచ్చేవాడ్ని. రెండు మూడుసార్లు రోడ్డుమీద ఆడపిల్లల్తో మాట్లాడటం చూశాడు. వాడికి కుళ్ళు ఎక్కువ."

"అది వ్యక్తిగతం. మరో కారణం చెప్పు."

"మరేమిటో నాకు తోచటం లేదు."

"నేను చెప్పనా?"

"చెప్పు."

"మీ యిద్దరికీ డబ్బుల విషయంలో నే తేడా లొస్తున్నాయి." శివం ఒక్కసారిగా బిత్తరపోయాడు.

"నిజమే బాసూ... వాడికి నేనంటే ఆ విషయంలో హడల్. నన్నెప్పుడూ డబ్బు లొచ్చే సీటు దగ్గర వెయ్యడు."

"నన్ను సరిగ్గా చెప్పనీ. అలా వేస్తే పూర్తిగా నువ్వే తినేస్తావని అతని భయం. మామూలుగా ఇలాంటి వ్యవ

వారాల్లో కాంప్రమైజేషన్ ఉంటుంది. ఇద్దరికీ వాటాలు పంచుకోవటం ఇష్టం లేదు. అతనికి ఆఫీస్‌లో ఒడ్డు వుంది నువ్వొక్కడివే. నీకూ ఉంది అతనొక్కడిదే. మీ తగాదాలు తిరుగుతుంది. ఈ విషయం చుట్టూనే. ఏమంటావ్?" అన్నాడు రాఘవ.

"నిజమే గురూ. వాడిది కర్నూలు. కావాలని వేయించుకున్నాడు. తనకు తిరుగులేదనుకున్నాడు. నాతోనే ఇబ్బంది వచ్చింది."

"అందుకు నీ పద్ధతులు నువ్వు అనుసరించావు. అతని పద్ధతుల్లో అతను పోయాడు. ప్రస్తుతం అతను నిన్నో దెబ్బ కొట్టాడు. నేను మాట్లాడాను కదా. అదంత ప్రమాదం లేదన్నాడు. నేనేం సీరియస్‌గా రాయలేదు కదా అన్నాడు. కాబట్టి ఈ సందర్భంలోనైనా మీరు కాంప్రమైజ్ అయితే బాగుంటుంది" అన్నాడు రాఘవ.

"లాభం లేదు గురూ. ఇంత జరిగాక వెనక్కి వెళ్ళటం మా వంశంలో లేదు. దెబ్బకి దెబ్బతియ్యాలి" అన్నాడు శివం. అతని కళ్ళు అప్పటికే ఎర్రబడ్డాయి.

"పగలు పెంచుకోవటం అంత మంచిది కాదు."

"మా వంశ లక్షణాల్లో అదొకటి బాస్. రివెంజ్ తీసుకోకుండా మేం యెప్పుడూ నిద్రపోం. మా వంశ లక్షణం మరోటుంది. అది వ్యభిచారం."

"ఆ విషయం రామారావుకెలా తెలిసింది?"

"ఎవడో చెప్పుంటాడు. వాడు గనుక నన్ను పట్టుకుంటే వదిలేవాడా? అరే ఎన్నిసార్లు ప్రయత్నం చేశాడు పట్టుకోవాలని. ఆఫీస్‌లో సడెన్‌గా చెక్ చేసేవాడు. అయినా మనం దొరికేవాళ్ళం కాదు. అదే వాడి బాధ. నేను పార్టీలందరినీ బాగా ఎక్కించి పంపేవాడ్ని.

చచ్చేవాడనులే."

"ఇంతకూ నీకెలా ట్రాన్స్‌ఫర్ అయింది."

"అదో పెద్ద వ్యవహారం. అక్కడ నాకో అమ్మాయితో సంబంధం ఉండేది."

"చిల్లర తిరుగుళ్ళు కాకనా?"

"అవును. ఒకరోజు దొరికిపోయాను. ఇంక ఇంట్లో చూడు రభస. భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. విడాకుల దాకా వచ్చింది గొడవ. మావాళ్ళే మధ్యలోవుండి నన్ను చివాట్లువేసి మమ్మల్ని కలిపారు. ఈ ట్రాన్స్‌ఫర్ కూడా వాళ్ళ పుణ్యమే. వాళ్ళే రికమండ్ చేసి మార్పించారు."

"ఇక్కడకూడా తిరుగుతున్నావు కదా?!" అన్నాడు రాఘవ ఆశ్చర్యంగా.

"ఏం చెయ్యమంటావ్. అది మా వంశ లక్షణం. మా తాత అరవై దాటినా తిరుగుతుండేవాడట."

"రేపు ఉదయం ఎనిమిది గంటలకల్లా వచ్చేయ్. లేకపోతే ఆయన దొరకడు."

"అలాగే."

"నీకు అప్పజెప్పి వెళ్తాను. ఆ మనిషి విషయమంతా చెబితే డ్రాఫ్ట్ రాస్తాను. టైపు చేయించి పంపేయ్. నేను రేపటినుండి క్యాంపుమీద వెళ్తున్నాను కదా. వారంలో తిరిగొస్తా. ఈలోపేం తొందరపడకు.

3

"ఇతను మా కొలీగ్ శివం. మీకు చెప్పా కదా" అంటూ పరిచయం చేశాడు రాఘవ.

"నమస్కారం సార్" అన్నాడు శివం.

"కూర్చోండి" అన్నాడాయన.

ఆయన పేరు వీరాచారి. ఆయన్ని చూస్తుంటే చాణక్యుడ్ని చూస్తున్నామా అనిపిస్తుంది.

శివం తనతో తెచ్చిన మెమో అందించాడు.

చిరునవ్వుతో అందుకున్నాడాయన. చదువుతున్నంత సేపూ ఆ నవ్వు చెక్కు చెదరలేదు.

"ఏం డేంజర్ లేదుగా సార్" అన్నాడు శివం.

పెదవి చప్పరించాడాయన.

"నాకు వేరే పనుంది. మీరు మాట్లాడి డ్రాఫ్ట్ తయారు చెయ్యండి" అన్నాడు రాఘవ. వీరాచారి తలూపాడు నవ్వుతూనే.

"మరి నేను వెళ్తాను. శివం నేను చెప్పింది గుర్తుంచుకో. వస్తానండి గురువు గారూ" అని చెప్పి రాఘవ వెళ్ళిపోయాడు.

"ఇంతకూ మీ ఇద్దరి మధ్యా గొడవ యేమిటి?" అడిగాడు వీరాచారి.

"ముందు నుండీ గొడవే సార్!"

"మీరు అతన్తో ఎలా ఉండాలనుకుంటున్నారు?"

"అంటే" అన్నాడు అర్థంకాక.

"మీరు అతన్తో తలపడదల్చుకుంటే మనం సీరియస్ గా ప్రొసీడవుతాం. లేదా మనం మనల్ని డిఫెండ్ చేసుకుంటూ రిక్వెస్టింగ్ మానర్లో రాయాల్సుంటుంది."

"నాకైతే చెప్పాలంటే వాడ్ని ఇలా రాయటం కాదు సార్. ఫిజికల్ గానే ఏదో పార్టు తీసేయాలని ఉంది." రాఘవాచారి నవ్వుతూ చూశాడు.

"మైడియర్ బాయ్. నీవు చాలా ఆవేశంగా ఉన్నట్లుంది. పగతీర్చుకునే పద్ధతి ఎప్పుడూ అంత డైరెక్టుగా వుండకూడదు. ఈ మెమో దేముందయ్యా. ఇలాంటివి మా

సర్వీసులో కొన్ని వందలు చూశాం. రివెంజ్ తీసుకోవటం ఓ కళ" అన్నాడాయన తాపీగా.

శివం ఆశ్చర్యంగా చూశా డాయనవంక.

"నువ్వు నీ దేహాన్ని మాత్రమే చూసి మురిసిపోకూడదు. శరీరం కంటే బుద్ధిబలం అవసరం. అర్థమయిందా?"

తలూపాడు శివం.

"అందుకే దేహంకాదు ప్రధానం. నువ్వు అరిచి బీభత్సం చేశావనుకో. అదేం విశేషం కాదు. నువ్వు తిట్టావ్. ఏమేమో చేశావు. సమయం వచ్చింది నొక్కేశాడు. దీన్నిబట్టి చూస్తుంటే రివెంజ్ తీసుకునే కళ నీ కంటే అతనిలో యెక్కువున్నట్లుంది. ఇప్పుడు నువ్వు ఆవేశంలో యే పని చేసినా యెదురుతిరుగుతుంది. అందుకే ప్రశాంతంగా ఓ పథకం రూపొందించుకోవాలి."

"నన్నేం చెయ్యమంటారు?"

"ఏం లేదు. ముందు మెమోకి సమాధానం రాసివ్వాలి. అసలు నాటకం అక్కడి నుండే ప్రారంభం అవుతుంది. రేపటినుండి నువ్వు పూర్తిగా మారిపోతున్నావు. నీ కెరీర్ నాశనం చెయ్యటానికి ప్రయత్నించిన ఆ వ్యక్తి మీద నీ కెలాంటి ద్వేషం వుండదు పైపెచ్చు గతంలో అతని మీద పోట్లాడినందుకు పశ్చాత్తాపం ప్రకటిస్తావ్. రోజు రోజుకూ నువ్విలా మారతావుంటే యితనేనా ఆ పాత వ్యక్తని అనుమానం వస్తుంది.

అప్పుడు నీ అసలు కార్యక్రమం ఆరంభమవుతుంది. అతన్నే కాక చుట్టుపక్కలవారికి కూడా నువ్వు మారావనే అభిప్రాయం కలిగించాక, నువ్వు రంగంలోకి దిగుతావు. అతని దినచర్యనూ, ఉద్యోగ జీవితాన్ని రహ

స్యంగా గమనిస్తావు. అతని బలహీనత యెక్కడ వుందో నువ్వు తెలుసుకోగలుగుతావు. అప్పుడు ప్రణాళిక చేయబడు తుంది. పిక్చర్‌లో నువ్వుండవు. ఆ పని నువ్వు చేశావని అనుమానం కూడా రాదు. అంతగా నిన్ను నమ్మాలి. అతను ఏమరుపాటుగా వుండాలి.

అతన్ని శారీరంగా బాధపెట్టగలవేమో గానీ అంత కంటే మానసికంగా బాధపెట్టగలగటమే గొప్ప. శారీర కంగా నువ్వు బాధపెట్టినా ఆ ఫలితం నువ్వు అనుభ వించాల్సి వుంటుంది" అన్నాడాయన.

శివం ఆయన మాటల్ని భక్తితో వింటుండిపోయాడు.

ఆ మాటల్లోని వాస్తవికత అతన్ని ఆకర్షించింది. రామారావు ఇలా రాయగలడని తను ఊహించలేదు. కర్నూలులో ఉన్నప్పుడు అత నేం చేయటానికి అవకాశం వుందో ఊహించేవాడు. అందుకు తగ్గట్టుగా ప్రవర్తించే వాడు. ఇప్పుడు ప్రమాదాన్ని తాను శంకించలేదు. ఈ బ్రాంచిలో అతను ప్రధాన అధికారి కాదు. అందుకే తక్కువ అంచనా వేశాడు. తను యేమరుపాటుగా ఉన్న ప్పుడు దెబ్బతీశాడు.

అదే రామారావుకు హెడ్ ఆఫీస్‌లో బలం వుంటే తన పరిస్థితి మరోలా వుండేది.

తమ హెడ్ ఆఫీస్ పరిస్థితి నిజంగానే విచిత్రమైంది. అక్కడ రికమండేషన్‌కు తప్పించి ఫాక్ట్స్ అండ్ ఫిగర్స్‌తో సంబంధం లేదు. ఈ విషయంలో రామారావు నిస్సహాయుడు. రికమండేషన్ వుంటే యెలాంటి వాస్తవా లయినా సమాధి కాబడతాయి.

రామారావుమీద కూడా చాలా ఆరోపణలున్నాయి. "హెడ్ స్ట్రాంగ్" అనే రామారావును పై అధికారులు

గ్యాని స్తుంటారు. అందుకే అతను తరచుగా ట్రాన్స్
కాబడుతుంటాడు.

మీరు చెప్పినట్లే చేస్తాను సార్!" అన్నాడు శివం!
యన చిరునవ్వు నవ్వాడు. "నా గదిలో కూర్చుందాం
అంటూ తీసుకెళ్ళాడు.

ను కొన్ని వివరాలు అడిగాక పావుగంటలో
ు తయారు చేశాడు. శివం ఆయన వాడిన ఇంగ్లీష్
ు ఆ భాషలో ఉన్నయనే విషయం మొదటి
గా తెలుసుకొన్నాడు.

యినా శివానికి అర్థమయిన విషయం ఒకటుంది.
నీతి అని వినటం, చదవటమే గాని తన అనుభవం
రాలేదు. ఒక విషయాన్ని యెంత నమ్రతగా, డిప్లొ
గా చెప్పవచ్చో, వీరాచారి డ్రాఫ్ట్ చెబుతుంది.
బ్యాలన్స్‌డ్ గానూ, కన్విన్సింగ్ గానూ వుంది.
ఇది నా ప్రమోషన్‌కు యే యిబ్బందీ కలిగించదు
"

వేరే ప్రొసీడ్ కాకుంటే మాత్రం యేముండదు.
కాక కూడా యింకా ఏక్షన్ తీసుకుంటారని నే
ను."

నేను ఈ రోజే సబ్‌మిట్ చేస్తాను."

ఈ లెటరు తీసుకెళ్ళి ముందు నీ మిత్రుడికి చూపిస్తు
వ్" అన్నాడాయన తాపీగా.

ఎవరికి? రామారావ్ కా?"

అవును."

నేనా!" అన్నాడు ఆశ్చర్యంగా.

చూశావా! అప్పుడే మామూలు మనిషివయ్యావు.
ుచ్చవనే వ్యక్తి రాగద్వేషాల్ని తన మనసులోతప్ప

ముఖంలోనూ, ప్రవర్తనలోనూ స్పష్టంగా చూపిం
గంభీరంగా అన్నాడు.

శివం జీవితంలో మొదటిపాఠం నేర్చుకొన్నాడ

"తప్పకుండా చూపిస్తా సర్. త్వరలో నే మి
కలుస్తాను."

"సంతోషం, విజయీభవ" అన్నాడాయన.

వీరాచారికి ఈ రకమైన సంఘర్షణ అంటే
యిష్టం!

4

"ఇదిగో సార్, హెడ్ ఆఫీసు మెమోకు రిప్లై
న్నాను. ఓసారి మీకు చూపించాలని తీసుకొచ
నమ్రతగా కాయితం అందించాడు శివం.

ఊహించని ఈ సంఘటనకు కంగారుపడిపో
రామారావు. "అబ్బే.... నా కెందుకయ్యా?"

"ఊరికే చూడండి సార్! లెటరులో యే
తప్పు లున్నాయేమో!"

రామారావు అనుమానంగానే అందుకున్నాడు.

"నా మీద మీరు రాశారని నాకేం కోపం
జనరల్ గా చూపిస్తున్నాను. ఆ తర్వాత యేం ర
నని మీ రనుకోవచ్చు కదా!"

"అబ్బే .... అదేం లేదయ్యా" అన్నాడు

"ఎవరితో వ్రాయించావయ్యా? బ్రహ్మాండంగా
అన్నాడు చదివాక.

"ఎవరితో మీ బోటాయనతో రాయించాను."

"చాలా బాగుంది" అన్నాడు రామారావ్.

"మీరు రాసింది నిజమేనండి. సుపీరియర్స్ ను
వించటం నాకు చేతకాలేదు. ఇప్పుడే అన్నీ నా

న్నాయి. ఇప్పటిదాకా మనం అనేక విషయాల్లో
ండుకున్నాం. నేను మిమ్మల్ని యెదురుగా తిట్టాను
నా గాని ....జరిగిందేదో జరిగిపోయింది. ఇకనుండీ
ంటి పరిస్థితుల్లోనూ మనం పోట్లాడుకోనే అవకాశం
ండదని నేను భావిస్తున్నాను."

మంచిదే కదయ్యా!" అన్నాడు రామారావు.

'మీ రిలా రాయటంవల్లే నాకు జ్ఞానోదయం
ంది."

'ఏదో కోపంలో రాశాను. ఏమనుకోకు."

'మీరు నన్ను ఏమనుకోకండి."

'ఇట్సాల్ రైట్!"

వం తన లెటర్ అందుకొని ఆఫీసుకు వెళ్ళాడు.

రామారావుకు చెప్పలేనంత ఆశ్చర్యంగా వుంది.
తొందరగా యిలా మారటం అసంభవం. ఇంత విన
గా ప్రవర్తించటం ఖచ్చితంగా ధూర్తలక్షణమే
వస్తున్నాడు. అయినా కొంతకాలం పరిశీలిస్తేనే గాని
ర్ణయానికి రాకూడదనుకున్నాడు.

శివం లెటర్ ఆఫీసులో సబ్మిట్ చేశాడు.

మేనేజరు పూర్తిగా చదివాడు.

"బాగుందయ్యా. చక్కగా రాశావు. అయినా
ంటివన్నీ రొటీన్. రామారావ్ అలా రాయటం యేం
గుండలేదు. పదికాలాలపాటు ఒకచోట కలిసి పని
యవలసిన వాళ్ళం. ఇలా మనస్పర్థలు పెంచుకుంటే
ంలా?" అన్నాడాయన.

"నిజమే ననుకోండి. అయినా ఇందులో నా తప్పు
డా వుంది. పూర్తిగా ఆయనదే అనటానికి వీల్లేదు.
మన్ని నేనే రెచ్చగొట్టాను" అన్నాడు శివం

నమ్రతగా.

"వాట్!" అంటూ ఆశ్చర్యంగా కుర్చీలోంచి లేచాడు మేనేజరు.

శివం నుండి అలాంటి జవాబు రాగలదని ఆ ఊహించలేదు.

"ఈ లెటర్ ఫార్వర్డ్ చేయండి."

"ఓ.కె!" అన్నాడాయన ఆశ్చర్యంగానే.

శివం బయటకొచ్చాడు.

"ఏంటి శివం! ఇంత మారిపోయావ్? నువ్వి మర్యాదగా మాట్లాడుతుంటే రామారావ్‌కు పో పోతుంది." అన్నాడు వెంకటేశ్వర్లు.

వెంకటేశ్వర్లు తోటివారిని రెచ్చగొట్టడంలో మునగ చెట్టెక్కించటంలోనూ నిపుణుడు. తనకు కావల సమాచారాన్ని పరోక్షంగా రాబట్టుకోవటంలో అతని తెలివితేటలు ప్రదర్శిస్తాడు!

"ఆయన మన మేనేజర్, మర్యాద యివ్వటం బాధ్యత."

"నువ్వు సరిగ్గా మాట్లాడుతుంటే నీ బోస్ అ పోయాడు. ఇప్పుడు మాతో మాట్లాడటం మానేశాడు

"నేను ఆయనతో యెప్పుడు తగాదాపడ్డా ఆయ వర్క్ విషయంలో మాత్రం పొగిడాను. మనకు మేనేజర్లలో అతనితోపాటు పనిచేసేవాళ్ళు తక్కు ఇదివరకు పోట్లాడుకునేవాళ్ళం. ఇప్పుడదేంలేదు అన్నాడు శివం.

"నిజమే" అన్నాడు వెంకటేశ్వర్లు.

సాయంకాలం మాటల సందర్భంలో వెంకటేశ్వ ఈ విషయమే రామారావుతో అన్నాడు.

"శివం చాలా మారిపోయాడు సార్!"

"ఏమయ్యా అట్లా అన్నావు."

"అవునండి మిమ్మల్ని ఎంతగా పొగిడారనుకున్నారు. మొదటిసారి నేను వినటం."

"ఏమోనయ్యా.... నాకేం నమ్మకంలేదు."

అయినా ఎందుకో సంతృప్తికలగటంలేదు. ఈ నమ్రత వెనుక ఏదో ప్లానుంది. ఎవరినన్నా మాట్లాడి కొట్టిస్తాడా? రోడ్డుమీద వస్తుంటే గుద్దించి కొట్టేసే తనకు దిక్కేమిటి? అయితే ఏం చెయ్యాలి?

ఈ పరిణామాలన్నీ ముందే ఊహించి వుండాల్సింది. అతను యేదో చేస్తాడు. అదికూడా ఫిజికల్ గానే. ఒక్కసారి తన వంక చూసుకున్నాడు రామారావు.

"నేనుకూడా అంత లావుంటేనా...." అనుకున్నాడు.

అతన్ని గుప్పిట్లో ఉంచుకోవాలి. అందుకు యేం చెయ్యాలి? రామారావ్ ఆలోచిస్తూ ఉండిపోయాడు

5

"నీలో ఆవేశం తప్ప ఆలోచనలేదు" అన్నాడు వర్మ.

వర్మకూడా రెవిన్యూ డిపార్టుమెంట్ లో పని చేస్తున్నాడు. ఇరవై సంవత్సరాల అనుభవంతో అతను రాటు తేలి వున్నాడు. వర్మతో ఓ విచిత్ర పరిస్థితిలో రామారావుకు స్నేహం కలిసింది. తన బాధను ఆయనకు వెల్లడించాడు రామారావు.

"ఎందుకంటే తెలివిగలవాడు తొందరపడడు. ఓ వేళ తొందరపడినా సగంపని చెయ్యడు."

"అంటే ." అన్నాడు రామారావు.

"మీరతని సి ఆర్స్లో మార్క్ రాశారు. బాగుంది. కానీ దానికి బేస్ యేమిటి? ఒక్క ముక్కలో అతను

యెవర్నీ గౌరవించడు, యారగెంట్ అని రాస్తే చాలదు. అందుకు తగ్గ ఆధారాలుండాలి. ముందునుండీ అలాంటి బేస్‌ను క్రియేట్ చేసుకోవాలి.

అతని ఉద్యోగ జీవితంలో మీరెప్పుడూ ముఖాముఖి తలపడ్డారు. కానీ రికార్డుగా యే ఆధారంలేదు. కనీసం ఓ మెమో గాని, వార్నింగ్ గాని లేకుండా అకస్మాత్తుగా అతను దుర్మార్గుడయిపోయాడంటే రెండు విషయాలు స్పష్టమవుతున్నాయి. అతనిమీద మీకు వ్యక్తిగత వైషమ్యం ఉంది. రెండు, యేదో విషయంలో మీ ఇద్దరికీ పడటంలేదు. ఆఫీసుల్లో ఆర్థిక విషయాలమీద తగాదాలొస్తాయి. ఇలా రాయటంద్వారా మీ సుపీరియర్స్‌లో మీమీద ఓ భావాన్ని క్రియేట్ చేసుకున్నారు.

ఏమాత్రం అనుభవమున్న ఆఫీసరయినా మీ రిపోర్టు చూసి "బేస్ లెస్" అని ఒక్క ముక్కలో కొట్టేస్తారు. మరి నువ్వు సాధించిందేమిటి? నథింగ్. నువ్వు బయట పడిపోయావు నీకు వ్యతిరేకంగా అతను తన కేడర్ నంతా కలుపుకొస్తాడు. నువ్విలా రాయటంవల్ల నీ ద్వేషాన్ని ప్రతిబింబించటం తప్పించి యెలాంటి ఉపయోగం లేదు.

అంతగా నువ్వు రాయదలుచుకుంటే పూర్తిగా దిగిపోవాలి. అటో ఇటో తేల్చుకోవాలి ఇలాంటి మెమోలు రెండిస్తే అతను మొద్దుబారి పోతాడు. అసలు యుద్ధం మొదలయ్యేదక్కడే" అన్నాడాయన.

"ఇంతదూరం నేను ఆలోచించలేదండి. కోపంలో రాసేశాను. అసలు మా హెడ్ ఆఫీస్‌లో ఎంత స్పష్టమయిన ఆరోపణలు చేసినా గాలికెగిరిపోతాయి. ఏదో బెదిరించుదామని రాశాను" అన్నాడు రామారావు.

"ఇలా ముందు చూపులేకుండా రాస్తే కోర్టుల్లోకూడా

-ఫేన్ చెయ్యాల్సొంటుంది. మనం ఓ విషయాన్ని సీరియస్ గా తీసుకుంటున్నామంటే దాన్ని డిఫెండ్ చేసుకునే సామర్థ్యం ఉండాలి. మీ ఆఫీస్ పరిస్థితి తెలిసికూడా మీరు రాంగ్ స్టెప్ వేశారు. ఈ సి.ఆర్స్ క్రిటిక్ వాళ్ళ సంప్రదాయం. ఇలా దుర్వినియోగం అవుతున్నాయనే వీటిని పూర్తిగా రద్దుచేయాలని డిమాండ్ చేస్తున్నారు" అన్నాడాయన.

"నేను సరిగ్గా రాయనిమాట నిజమే. కానీ అతని ప్రవర్తన దారుణంగా వుంటుంది" అన్నాడు రామారావు తన చర్యను సమర్థించుకుంటూ.

"అలాంటప్పుడే ఎటాక్ ఇవ్వాలి. దొంగలుపడ్డ ఆర్నెల్లకు కుక్కలు మొరిగినట్టుగా ఇప్పుడు రాస్తే ఎలా? ఇలాంటి విషయాల్లో తొందరపడకూడదు."

"నిజమేనండి. నాకూ అనుభవం లేదు కదా. మరో విషయం తెలుసా? ఈ నడుమ అతను చాలా మారిపోయాడు. ఎంతో మర్యాదగా ఉంటున్నాడు. ఆ విషయం నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది."

వర్మ కొంచెం సేపు ఆలోచించాడు.

"ఇలాంటి విషయాల్లో రకరకాల వారుంటారు. రివెంజ్ తీసుకోవటంలో అదో భాగం. మీరు యేమరుపాటుగా ఉండకండి. అతన్ని ఓ కంట కనిపెడుతుండండి."

"నాకు అతని గురించి ఒకటే భయం. చాటుగా దాడిచేస్తాడని లేదా యెవరితోనయినా చేయించగలడని. అతను తీసుకునే రివెంజ్ అలానే వుంటుంది" అన్నాడు రామారావు.

వర్మ తలూపాడు సాలోచనగా.

"పోలీస్ రిపోర్ట్సే ఎలా ఉంటుంది" అన్నాడు రామారావు.

"ఛ ...ఇంక ఆఫీస్‌లో నీకు పరువేముంటుంది. అతని వ్యక్తిగత జీవితంలో యేవో బలహీనతలుంటాయి. అవి క్యాచ్ చెయ్యాలి. తిరిగి మరెప్పుడూ నీ జోలికి రాకుండా ఉండాలంటే ఆ రూట్లోనే సాధ్యం. నువ్వుకూడా అతని పట్ల ప్రేమ ప్రదర్శిస్తూనే నీ చేతిలోకి తెచ్చుకోవాలి...." అన్నాడు శర్మ.

"అవును. ఈ విషయంలో నా ప్లాన్స్ నాకున్నాయి" అన్నాడు రామారావు.

శివం జీవితంమీద రామారావ్ షాడోపడటం ఆరంభమయింది ఆ క్షణంలోనే!

6

శివం ఓ సెక్స్ మానియాక్.

రోడ్డుమీద పోయేటప్పుడు వచ్చే పోయే స్త్రీలను కొరుక్కు తినేట్లు చూస్తాడు. అతని సైకిల్ వారిని రాసుకుంటూ వెళ్తుంది. అతని కళ్ళూ, చేతులూ ఏవేవో సంజ్ఞలు చేస్తూనే వుంటాయి. వాళ్ళు పెద్దవారు గానీ, చిన్నవారు గానీ యెవరయినా సరే అతని స్వభావం అంతే.

అతనిలో మరో లక్షణం వుంది. సెక్స్‌కు సంబంధించిన విషయాల్ని కలర్‌గా వివరించటం. ఈ విషయంలో శివానికో సూత్రం వుంది....ఏ వయసువారైనా ఫర్వాలేదు. ఆమె 'స్త్రీ' అయివుంటే చాలు. "స్త్రీ గొప్పది. ఏ స్త్రీ అయినా నన్ను కదిలిస్తుంది" అంటుంటాడతను. అతనో స్పెసిమన్. శివం సెక్స్ బలహీనతలమీద గొప్ప పరిశోధన చేయవచ్చు.

సంభోగ సమయంలో అతని ప్రవర్తన కిరాతంగా ఉంటుంది. అతనికి తృప్తి అనే పదానికి అర్థం తెలియదు. ఎప్పుడూ యింకా యేదో అనుభవించాలనే ఆరాటం.... తపన. అతని పద్ధతుల్ని సంసార స్త్రీ లెవరూ ఆమోదించరు. అందుకే అతని దృష్టి దేశం మీదుంటుంది.

అతని శాడిస్ట్ పద్ధతులకు వేశ్యలు సహకరించవలసిందే—వారికి తప్పదు కాబట్టి. శివం డబ్బు విషయంలో పొదుపుగా ఉంటాడు. అతనెప్పుడూ డబ్బులిచ్చి స్త్రీల దగ్గరకు పోడు. అతని ముఖంచూసి ఆకర్షింపబడేది తక్కువ రకం స్త్రీలు. అలాంటివారి దగ్గరికే పోతుంటాడు. ఈ విషయం ఇంటిదగ్గర తెలియకుండా జాగ్రత్త పడతాడు.

శివం భార్య గ్రాడ్యుయేట్. కర్నూలులో జరిగిన సంఘటనకే ఆమె తీవ్రంగా గాయపడింది. మధ్యవర్తుల ద్వారా అప్పుడు సంసారం చక్కబడింది. ఇప్పుడూ శివం తిరుగుళ్ళు గమనిస్తే—వ్యభిచారం చేస్తున్నందుకు కాదు ఆమె కుంగిపోయేది—తన భర్త ఎలాంటి స్త్రీల దగ్గరకు వెళ్తున్నాడనే విషయం భరించలేక! అంత దారుణమైన బలహీనతలు కలిగున్న వ్యక్తి శివం!

రామారావుకు అతని గురించి చూచాయగా తెలుసు—ఆడపిచ్చి వుందని. కానీ లోతుల్లోకి వెళుతున్న కొలదీ అతని ప్రవర్తన అర్థమయి ఆశ్చర్యపోయాడు.

ఈ నడుమ శివం దృష్టిలోకి యిద్దరు మహిళలొచ్చారు. అందులో ఒకావిడ నల్లగా వుంటుంది. ఆమెకు చాలా కాలంగా ఫారిన్ నైలెక్స్ చీర ధరించాలనే కోరిక వుంది. ఆమె శివం దృష్టిలోకి వచ్చింది. తనకా చీర తెచ్చిపెడితే సుఖం అందించగలనని ఆమె

వాగ్దానం చేసింది. నెలాఖరు కదా జీతం అందుకొన్నాక కొనిపెడతానని నచ్చచెప్పబోయాడు శివం. కానీ ఆమె అందుకంగీకరించలేదు.

మరో అమ్మాయి ఎక్కడి నుండో వచ్చేసింది. ఆమెకు ఈ నడుమే పెళ్ళయింది. ఆమెకు తన భర్తంటే యిష్టం లేదు ఆమె భర్తకూ తనంటే అయిష్టమూ, అనుమానం! అందుకే ఓ సాయంకాలం పూట మేడమీదినుండి క్రిందకు నెట్టేశాడట. దాంతో ఆమెకు మూడునెలల గర్భం పోయిందట. అక్కడ వుంటే ఏదో రోజు చంపేయగలడని ఆమె ఇంటినుండి వచ్చేసింది.

ఏ రకం పక్షులు ఆ గూటిని చేరతాయని ఆమె శివం గూటికి చేరింది.

ఆఫీసు అయిన దగ్గర్నుండి అతను తిరుగుతుంటాడు. ఆ వేటలో వీళ్ళిద్దరూ తగిలారు. మొదటి విషయం వాయిదా వేశాడు. రెండో అమ్మాయి మాత్రం "మీ యిష్టమయితే నే నిక్కడే వుండిపోతాను. ఏదన్నా గది చూడండి. నాకు కొంచెం భోజనానికి ఇవ్వండి" అంటూ ప్రాధేయపడింది.

ఆమెకు వెంటనే లేబర్ యేరియాలో ఓ గది చూశాడు.

రామారావు ఈ విషయాలన్నీ సేకరించి పెట్టాడు. అతనలా సేకరించగలడనే అనుమానం కూడా శివానికి కలగలేదు. శివానికి తన పతనమయిన జీవితాన్ని గొప్పగా చెప్పుకోవటంలో ఆనందం వుంది.

శివం ఈ గొడవల్లో వున్నా రామారావు జీవితానికి చెందిన చీకటి కోణాల్ని బయటకు తియ్యగలిగాడు.

రామారావు గొప్ప లంచగొండి!

అతను తనకు బాగా నమ్మకమైన వ్యక్తి ద్వారానే డబ్బు తీసుకుంటాడు. అందులో అతనికి కొంత వాటా పోతుంది. తనేమో పని చేస్తాడు. ఎవరికీ అనుమానం రాదు. రామారావు జీవితం లోతుల్లోకి వెళ్ళాక శివానికి మరి కొన్ని విషయాలు తెలిసివచ్చాయి.

వారి కుటుంబంలో పైకి వచ్చింది అతనే. మిగతా వాళ్ళందరూ కూలిపనులు చేసుకుంటున్నారు. వారంతా కష్టపడి రామారావును చదివించారు. ఈ స్థితికి వచ్చాక అతనవన్నీ మరిచిపోయాడు. వాళ్ళెవర్నీ కలుసుకోవటానికి అతనంగీకరించడు. వారికి పైసా కూడా సహాయం చెయ్యడు. అందుకే వారందరికీ రామారావంటే అసహ్యం. కాగా ట్రాప్ తయారు చేయాలి. అందులో రామారావు ఇరుక్కోవాలి.

అందుకు తగ్గ సలహా ఇవ్వగలిగేది వీరాచారే!

6

"మా వాడి గురించి పూర్తి వివరాలు సేకరించాను సార్!" అన్నాడు శివం, వీరాచారితో.

"మంచిది, అతను క్యాష్ తీసుకుంటున్నాడా?"

"అవును. కాని అతను డైరెక్టుగా తీసుకోవటంలేదు.

"ఎవరిద్వారా తీసుకుంటాడు?"

"అటెండర్ ద్వారా."

"అలా అయితే కష్టం కదా!"

"అది మీరు ఆలోచించాలి."

"అతన్ని పట్టించాలంటే ఒకటే పద్ధతి వుంది. ఎ.సి. బి. వాళ్ళకి చెప్పటమే. వాళ్ళు కొన్ని ప్రత్యేకమైన నోట్లు ఇస్తారు. అవి తీసుకుంటుండగా వాళ్ళు వస్తారు. కొంచెం ఆలస్యం అయినా ఫర్వాలేదు. ఆ నోట్లు తీ

ఉంటే వేలిముద్రలు పడతాయి."

"నిజమే అనుకోండి. కానీ వాడు స్వయంగా తీసుకోడే? —"

"తప్పకుండా తీసుకుంటాడు. ఆయన బాగా నమ్మిన వ్యక్తి అయివుండటం అవసరం. ట్రాక్టవాళ్ళ దగ్గరయితే ఎటూ ఆ టెండర్ తీసుకుంటాడు. బాగా నమ్మకముంటే ఆయనే తీసుకుంటాడు."

"ఎందుకనంటారు?"

"నమ్మకం మొదటి కారణం. రెండోది ఆ అటెండర్ గాడు ఏం తీసుకున్నాడో యేం తెలుస్తుంది? పైగా వాడికి వాటా ఇవ్వటం యెందుకు?"

"నిజమే!"

"ఒక్కసారి ఆ జీవితానికి అలవాటుపడితే చూపెప్పుడూ డబ్బుమీదే వుంటుంది. అలాగే సాధ్యమైనంత వరకూ రాబట్టుకోవటానికే చూస్తారు. మరొకడికి పైసా యివ్వాలంటే ప్రాణం పోతుంది. అందుకని మంచిమార్గం యేమిటంటే వాడికి నమ్మకమైనవాడిని పట్టుకోవాలి. అతని చేత ఎ.సి.బి. వారికి రిపోర్టు చేయిస్తే ట్రాప్ రూపొందిస్తారు.

ఒక్కసారి దొరికాడా వాడి ఖర్మ జీవితంలో ఆ దెబ్బ మరిచిపోడు. ముందు సస్పెండ్ అవుతాడు. ఆ తర్వాత కోర్టులచుట్టూ తిరగటంతో సరిపోతుంది. వాడు సంపాదించిందంతా హారించుకుపోతుంది. అర్థమైందా?" అన్నాడాయన.

"ఇప్పటినుండి ఆ ప్రయత్నంలో ఉంటాను సార్!"

"గో ఎ హెడ్!" ఆశీర్వదించాడు వీరాచారి.

శివం వస్తుండగా హైలెక్స్ చీర కనపడింది. ఆ

ప్రక్కగా సైకిల్ త్రిప్పాడు.

"ఏం దేవి!" అన్నాడు శివం.

"నువ్వా?" అందామె ఉలిక్కిపడుతూ.

"ఎక్కడ నుండి వస్తున్నావు?"

"బజారులో పనుండి పోయాను."

"రమ్మంటావా?"

"నువ్వా చీర సంగతి మాట్లాడవు!"

"చూస్తుంటే నువ్వా చీర కోసమే ఊ అన్నట్టుందే" అన్నాడు శివం.

ఆమె కొంచెం దెబ్బతిన్నట్లుగా చూసింది.

"అంత నమ్మకం లేకపోతే ఎలా? జీతాలు రాగానే కొని పెడతానని చెప్పాను గదా. మనుషుల్ని నమ్మాలి" అన్నాడు వెంటనే.

ఆమె ఆలోచించింది. శివం ఆఫీసు అడ్రసు ఆమెకు తెలుసు. అవసరమయితే తాను అక్కడకు వెళ్ళి తెచ్చుకో గలదు. ఆమె భర్త ముసలివాడు. సెక్సు విషయంలో ఆమెకు అసంతృప్తి వుంది. ఆమెకు సెక్సు చీరమీదే కాక ఇంకా చాలా వస్తువులమీద ప్రేముంది. ఆమె రోజూ చూసే సినిమాల ప్రేరణ అది.

"సరే రా!" అందామె.

"మీ వాళ్ళెవరూ లేరుగా?"

"ఎవరూ లేరు. ముందు నేను వెళ్తాను. ఆ తర్వాత రా!" అంది.

ఆమె వెళ్ళిపోయాక పదినిముషా లుండి ఆమె ఇంట్లోకి వెళ్ళాడు శివం. అతని కళ్ళు కామంతో నుండిపోతు న్నాయి అమాంతం మీదకు లాక్కున్నాడు.

"ఉండు. బట్టలు చిరిగిపోతాయి. చీర తెమ్మంది

అందుకే. మంచి చీర కట్టుకొని వద్దామనుకుంటే___"

"ఇప్పటిదాకా మనం అనలేం కదా! ఫస్టు తర్వాత నీకు చీరే కాదు. మేచింగ్ బ్లౌజు కూడా ..." అన్నాడు శివం. ఆమె మురిసిపోయింది.

అరగంట తర్వాత శివం వంక ఆదోలా చూస్తూ అంది.

"నీకు పెళ్ళయిందా?"

"అయింది. ఏం?"

"నీ పెళ్ళాం ఎట్లా ఊరుకుంటుంది?"

శివం వికృతంగా నవ్వాడు.

"నువ్వు మనిషివి కాదు. ఇదేం పద్ధతి?" అంది కొంచెం కోపంగానే.

శివం కళ్ళవెంట నీళ్ళు వచ్చేదాకా నవ్వాడు.

"చీర సంగతి మరచిపోకు" అంది.

"బ్లౌజు కూడా" సవరించాడు శివం.

తిరిగి వస్తుండగా శివం మనసులో ఆ వ్యక్తి మెరిశాడు!

8

"శివం భార్యకు,

ఈ లేఖ ఆసాంతం చదివి ఓ నిర్ణయానికి రమ్మని కోరుతున్నాను. మీరు ఎంతో చదువు కొని, సంస్కారం కలిగుండి ఓ సెక్స్ పెర్వర్ట్ చేతుల్లో బానిసగా బ్రతకాల్సి రావటంపట్ల నా సానుభూతి ప్రకటిస్తున్నాను.

మీ దెంతటి దురదృష్టం. ఏ పురుషుడికయినా పర స్త్రీలపట్ల కొంత వ్యామోహం ఉంటుంది. కానీ దానికీ ఓ హద్దుంది. మీ భర్త లీలల గురించి మీకు తెలిసింది చాలా తక్కువ.

కానీ అతని నగ్న స్వరూపం మీకు తెలిస్తే

గుండెలు బ్రద్దలయిపోతాయి. అతను ఎలాంటి ఆడవారితో తిరుగుతున్నాడో ఒక్కసారి మీరు గమనిస్తే ఇంక జీవితంలో అతనితో కాపురం చెయ్యటం సంభవించదు. రోడ్లవెంట తిరిగే వారూ, వేశ్యలు, మదంతో కొవ్వెక్కినవారూ ఇంకా ప్రత్యేకించి వయసుమళ్ళిన వారు. వారే అతను మెచ్చిన రంభలు.

ఓ బాధ్యతాయుతమైన ఉద్యోగంలో ఉంటూ ఇలా ఎందుకు దిగజారాలి? ఈ విషయం మీ స్నేహితులకీ, మీ బంధువులకూ తెలిస్తే మీరు తలెత్తుకు తిరగగలరా?

మీ వారి తాజా లీలలు యేమిటో తెలుసా? ఈ ఊళ్ళోనే ఓ అసాధ్వకు ఆశ్రయం ఇచ్చాడు. ఆమె గురించి మీకు తెలుసుకోవాలనుందా? వెంటనే క్రింది అడ్రస్‌కు వెళితే పూర్తి సమాచారం లభిస్తుంది. మర్యాదగా అడగండి. ఆమె ఏం చెబుతుందో వినండి.

ఇంకా మీకు కావాలంటే అతను పర స్త్రీలతో ఉన్నప్పుడు పట్టించగలం. ఆ రోజైనా మీ వ్యక్తిత్వం నిలుపుకొంటారా? ఆ రోజైనా మీ బానిస బ్రతుకునుండి బయటపడగలరా? లేక భర్త కదాని క్షమించి వదిలేస్తారా?

దారుణమైన అలాంటి మనుషుల నడుమ మసిలే ఆ వ్యక్తి తిరిగి మీతో కాపురం చేస్తున్నాడంటేనే శరీరం గగుర్పొడుస్తుంది. ఓ మంచి వ్యక్తికి ఎందుకీ శాపం?!

ఈ లేఖ చూసి ఉద్రేకపడి ఆయన్ను ఏమేమో అనటంకాదు. బట్టలు సర్దుకొని పుట్టింటికి పోవటం కాదు. నా సవాలు తెలుసుకోండి. అతని పతనమయిన జీవితాన్ని కళ్ళారా చూడండి. మీరు యథార్థాలను ఋజువు చేసుకోండి. అప్పుడు మాత్రమే మీరో నిర్ణయానికి రాగలరు. ప్రస్తుతానికి ఇంతకంటే రాయదలచుకోలేదు.

మీ శ్రేయస్సు కోరూ...."

క్రింద సంతకం లేదు.

"అగ్నిబాణం!" అన్నాడు వర్మ.

రామారావు చిరునవ్వు నవ్వాడు.

"ఇది ఎప్పుడు పంపిస్తున్నావ్."

"సరైన సమయంలో."

"ఈ రకంగా జరుగుతుందని అతనూహించడు. జీవితంలో తిరుగులేని దెబ్బ ఇది."

"అవును. వాడు ఇంకేదైనా రూట్లో వస్తే.... అదే నామీద దాడిచేయాలనుకుంటే అందుకు నేనుకూడా సిద్ధంగా ఉన్నాను."

"ఎలా?"

"ఏసిడ్ పొయ్యటం నాకూ వచ్చు" అన్నాడు రామారావు గంభీరంగా.

అతనిలో ఇంత పగ దాగుందని మొదటిసారి గుర్తించాడు వర్మ.

9

"ఊరక రారు మహాత్ములు" అన్నాడు శివాన్ని చూస్తూ పున్నారావు.

"కొంచెం పనుండి వచ్చాను" అన్నాడు శివం.

"మాట్లాడుకుందాం రండి" అంటూ తన గదిలోకి తీసుకెళ్ళాడు.

"మీకు తెలుసుగా, మా మేనేజర్ రామారావు ఆ నడుమ నామీద రిపోర్టు రాసి నా భవిష్యత్ చెడగొట్టా లనుకున్నాడు" అన్నాడు శివం లోపలికి వెళ్ళాక.

"అవునవును. అసలేమిటి గొడవ."

"ఖచ్చితంగా చెప్పాలంటే వేరే యే శత్రుత్వంలేదు. మన కులంవారంటే ఆయనకు ద్వేషం. ఆసలు తగాదా అదే. మనం పైకి రావటాన్ని అతనేమాత్రం సహించ లేదు. ఇది కుల తగాదా తప్పించి మరొకటికాదు."

పున్నారావు తన కులానికి చెందిన ఓ సంఘానికి బాధ్యత వహిస్తున్న విషయం శివానికి తెలుసు.

"అయితే ఏం చేద్దామని."

"సి.టి.ఓ. గారు మా అంతులవుతారు."

"ఎవరు రాఘునాధంగారా?"

"అవును."

"అలాగా" అన్నాడు సంతోషంగా.

"ఆయనకికూడా ఈ విషయం చెప్పాను. ఎంతో బాధపడ్డారు. మనం ఐకమత్యంగా లేకపోవటంవల్లనేగా ఇలాంటి వారంతా మనమీద దాడిచేస్తున్నారు, అంటూ బాధపడ్డారు."

పున్నారావులో రక్తం వేగంగా ప్రసరించసాగింది.

"నిజమే కదా" అన్నాడు.

"అందుకే దెబ్బకు దెబ్బ తీయాలని."

"తియ్యాల్సిందే" అన్నాడు పున్నారావు పట్టు దలగా.

రామనాధంగారితో కాబోయే పరిచయాన్ని తలచు

కొని మరింతగా పొంగిపోయాడు.

"మీరంటే అతనికి బాగా నమ్మకం కదా. మనం ఎ.సి.బి. వాళ్ళకు రిపోర్టు చేద్దాం. మీ దగ్గర లంచం తీసుకుంటుండగా ఆయనను పట్టుకుంటారు—"

పున్నారావు కొంచెంసేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

"మీరు యేమాలోచిస్తున్నారో నాకు తెలియదు. జాలి వాడికేం లేదు. ఆ వలపు నా కొడుకులే అంత అన్నాడుట. తెల్లారితే నే యెవరి దగ్గర వాడు చెయ్యి చాచేది. మరా కూతలేటి? ఆలోచించండి. మీ ఇష్టం. మన వాళ్ళనుకుంటే హెల్ప్ చెయ్యండి. అసలు కొడుకుని యెంతో కాలం ఇక్కడ ఉంచరు."

"అది కాదండి. ఇంత జరిగాక ఇంకా వెనకడుగెందుకు? కాలీని లేపేస్తే పోలా?" అన్నాడు తాపీగా.

మొట్టమొదటిసారిగా షాక్ తిన్నాడు శివం.

"మనవాళ్ళకి చెబితే అయిదు నిమిషాలు. ఎవరెందుకు కొట్టారో కూడా అర్థంకాదు."

"కానీ, అనుమానం నా మీదికొస్తుంది. ఇలా అయితే లంచం తీసుకుంటుండగా దొరికినట్లవుతుంది. పరువూ పోతుంది. మన పని అవుతూంది."

"అలా చేద్దామంటారా" అన్నాడు పున్నారావు.

"అవును."

"సరే ఎ సి.బి లో మనోళ్ళాయనున్నాడు. వాడు కేసు బుక్ చేస్తే తిరుగు ఉండదు. నేను మాట్లాడుతాను."

శివానికి అంతులేనంత సంతోషం కలిగింది.

"నేను అంకుల్‌కి ఈ విషయం చెబుతాను."

"ఆయనతో రోజు గ్రాండ్ పార్టీ ఇద్దాం. ఈ పని సక్సెస్ అయ్యాక" అన్నాడు పున్నారావు.

శివానికి యిలాంటి సందేహాలు లేకుండా ఓ విషయం స్పష్టమైపోయింది. ఈ సమాజంలో కులం లోతుల్లోకి చొచ్చుకుపోయింది! పున్నారావు బలహీనతను తనకి అనుకూలంగా మలుచుకోగలిగాడు.

ఆ ఆనందంలోనే వేగంగా సైకిల్ తొక్కుతున్నాడు.
ఎవరో పిలిచినట్లనిపించింది.
వెనక్కి తిరిగాడు. నైలెక్స్ చీర! దగ్గరకొచ్చింది.
"ఏం సారూ.... కనపట్టంలేదు."
"పనుల్లో తిరుగుతున్నా."
"ఇంకా జీతాలు రాలేదా?"
"వచ్చాయి. ఏవో ఖర్చులు. ఈ నెల్లో తప్పదు."
"ఇదికూడా కథేనా?"
"నీమీద ఒట్టు."
"చూస్తాగా."
"ఏమి సంగతులు?"
"ఏం లేదుగానీ...." అంటూ ఆగింది.
"ఏంటో చెప్పు?"
"నీకెందుకు చెప్పాలా అని!"
"అదేమిటి అలా అంటావ్___"
"నాకు తెలిసిన ఓ పిల్లుంది."
"భలేదానివే, ఈ విషయం చెప్పనంటావ్,"
"పనిపిల్ల."
"ఎక్కడుంది?"
"మా ఊర్లో___"
"సర్లే" చప్పరించాడు.
"నా దగ్గరకొస్తుంది. లడ్డులాంటి పిల్ల."
"నిజంగానా."

"కానీ....నువ్వు మరీ కష్టపడతావు."

"ఛ ఊర్కో. రేపు ఫస్టుకి చూడు."

"నువ్వు అబద్ధం చెప్పినా నమ్ముతున్నా."

"ఛఛ అదేం లేదు. ఏవో ఖర్చులు. ఈసారి జీతం తీసుకోగానే ముందు మీ ఇంటికే రావటం."

"సర్లే. రాగానే కబురు చేస్తాను."

10

ఆఫీస్ గదిలో రామారావు కెదురుగా కూర్చున్నాడు పున్నారావు. రామారావు మొఖం యెందుకో అప్రసన్నంగా వుంది.

"ఏమిటలా వున్నారు" అన్నాడు పున్నారావు.

"ఏం చేస్తాం చెప్పండి. మా వుద్యోగాలెంత? మే మెంత? ఇంటి దగ్గర టి.వి. కావాలంటూ గొడవ. చెబితే అర్థం చేసుకోవాలి. ఏమైనా వ్యాపారం నయం. ఏది కావాలంటే అది కొనుక్కోవచ్చు."

"పోనీ—మీరుకూడా ఓ వ్యాపారం ప్రారంభించండి."

"మీ కేమిటి చెబుతారు. కేపిటల్ కావద్దూ—"

"దాందేముంది. అదే వస్తుంది."

"ఎక్కడనుండి. వెధవది టి.వి. కొనటం మనవల్ల కావటంలేదు. ఇంట్లో రభస."

"అలా అయితే ఓ పని చెయ్యండి. ఎంత కావాలో తీసుకోండి."

"అప్పుతీర్చొద్దూ" అన్నాడు రామారావు. అప్పటికే అతని కళ్ళు మెరిశాయి.

"తీరుద్దురుగాని లెండి. మీకు వీలయినప్పుడు ఎంతుంటే అంతివ్వండి" అన్నాడు పున్నారావు నవ్వుతూ.

"మీలాంటి పార్టీ లుంటే మాకు రోజూ పండుగే."

"ఏదో మీ దయ" అంటూ జేబులోనుండి డబ్బు తీశాడు. లెక్క పెడుతూ అడిగాడు, "మూడు చాలా."

"ఇంకెందుకు. బ్లాకండ్ వైట్ తీసుకుంటూ!"

"ఇది వైటేనండోయ్. ఇంద—" అందించాడు.

రామారావ్ అంగుళీని టేబుల్ సొరుగులో వేశాడు;

"లెక్క పెట్టలేదు" అన్నాడు పున్నారావు.

"భలేవారే అసలింతో జోక్ తెలుసా? మా మిత్రుడొకాయన చెప్పాడు. ఎవరి దగ్గర్నుండి క్యాష్ ఇలా తీసుకోకూడదని. కవర్ లో పెట్టి మాత్రమే తీసుకొమ్మని-" అన్నాడు.

"ఎక్స్‌క్యూజ్ మీ! ఐయామ్ వి. సి. రావ్, ఫ్రమ్ ఎ.సి.బి. మిమ్మల్ని చెక్ చెయ్యాలి" తన ఐడెంటిటీ కార్డు చూపిస్తూ అన్నాడు వచ్చినతను.

అంతలోనే మరో ఇద్దరు వచ్చారు.

"ఎ....ఎ....ఎందుకు?" రామారావు తడబడ్డాడు.

వారేం మాట్లాడకుండా వెతకటం ప్రారంభించారు. టేబుల్ సొరుగులో డబ్బు దొరికింది.

"ఇవేమిటి?"

"అవి....అవి...."

"ఇవి మేం మార్కు చేసిచ్చిన నోట్లు!"

"ఆయన అప్పుగా ఇచ్చారు. పున్నారావుగారూ! చె.... చెప్పండి."

"వీటికోసం నా ప్రాణాలు తీస్తున్నాడండి" అన్నాడు పున్నారావు.

"మోసం!" అరిచాడు రామారావు.

"యూ ఆర్ అండర్ అరెస్టు" గాల్లో తేలివచ్చాయా మాటలు.

• • •

శివం హుషారుగా అడుగు పెట్టాడు.

ఎదురయింది సైరెక్స్ చీర!

"ఏం డార్లింగ్ ఏమయింది?"

"వచ్చింది—"

"ఎక్కడ?"

"అంత తొందరేందుకు? మరోసారి చెబుతున్నా. అది పసిపిల్ల. జాగ్రత్త!"

"భలేదానివే!" అంటూ బుగ్గమీద చిటికె వేసి వెళ్లాడు.

లోపల ఓ అమ్మాయి ఆ వైపు తిరిగి నిలబడి ఉంది. శివం అప్పటికే ఉద్రేకంలో వున్నాడు. దగ్గరకు వెళ్ళి తనవైపు తిప్పాడు.

ఒక్కసారి నిరాశ కలిగింది.

ఆ అమ్మాయి లడ్డు కాదు—కనీసం చాక్లెట్ కూడా కాదు.

కానీ స్త్రీ! ఎవరయితే యేం!

ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

అప్పుడు తలుపుమీద శబ్దం....

"మళ్ళేమయింది....?" విసుక్కుంటూ తలుపు తెరిచాడు.

చాచి మొఖాన కొట్టినట్లయింది. ఎదురుగా పోలీసులు!

వారి చేతిలో సంకెళ్ళు!

ఏం జరుగుతుందో అర్ధమయ్యేలోపు చేతులకు బేడీలు పడ్డాయి.

"ఏమిటిది?" అనబోయాడు:

"నడువెహ" ముందుకు నెట్టారు.

క్రింద పడబోతూ నిలదొక్కుకొన్నాడు.

కోపంగా వెనక్కు తిరగబోయాడు.

కళ్ళముందో మెరుపు!

ఎదురుగా—

రక్తవర్ణం దాల్చిన కళ్ళతో ఆమె!

నిజంగా తన భార్య!!—

ముగింపు: రివెంజ్ తీసుకోవటంలో ఇద్దరూ మరిచిపోయిన అంశం ఒకటుంది. ఎదుటివారి వివరాలు సేకరించాలనే ఆరాటం తప్పించి—తమలో ఏ అంశం వినియోగించుకోగలరో ఊహించకపోవటం!

'రివెంజ్' ఎప్పుడూ విషాదకరంగానే ముగుస్తుంది.

—:అయిపోయింది:—